క్లుప్తంగా

సమావేశం నేడు

నెల్లూరు (వేదాయపాళెం): రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున ఆయనకు మద్దతుగా ప్రచారం చేసేందుకు మంగళవారం గాంధీబొమ్మ సెంటర్‌లో కార్యాచరణ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా దళిత సంఘాల గౌరవాధ్యక్షుడు అల్లం రాజా తెలిపారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నేతలు చేమూరు రవికుమార్, మురళి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ), యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (యూఈసీయూ) నాయకులు వివిధ సమస్యలపై కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొజ్జా సుమన్ మాట్లాడుతూ విద్యుత్ భవన్ వద్ద ఈనెల 8వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని కోరారు. మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం ఇవ్వాలన్నారు. జెన్‌కో ప్లాంట్లలో పనిచేస్తున్న కార్మికులకు శాశ్వత గేట్‌పాస్‌లు అందజేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు పెంచల ప్రసాద్, హరినారాయణ, లక్ష్మీపతి, నజీర్, ఆరీఫ్, భాస్కర్, సునీల్ ఉన్నారు.

క్రీడా పోటీల్లో పాల్గొనాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొనాలని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ బీవీ శేషారెడ్డి పిలుపునిచ్చారు. ఏపీ ఎలక్ట్రిసిటీ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన అంబాపురం సర్కిల్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో విధులు నిర్వహిస్తున్న వారికి ఈనెల 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివిధ ప్రాంతాల నుంచి 30 టీంలు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈలు బలరామమూర్తి, రాధిక, బాలకేశవులు, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార్ వడివేలు, డీఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగొద్దన్నందుకు భార్యపై అలిగి భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. హరనాథపురం రెండో వీధిలో జానీబాషా (59) నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు భార్యలున్నారు. పెద్ద భార్యకు ఏడుగురు సంతానం. రెండో భార్య వెంకటమ్మకు ఒక కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం అతను ఆమెతో ఉంటూ అదే ప్రాంతంలోని ఓ ప్రముఖ విద్యాసంస్థల యజమాని ఇంటికి నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. జానీబాషా మద్యానికి బానిసయ్యాడు. గతంలో పక్షవాతం బారినపడి కొంతకాలం తర్వాత కోలుకున్నాడు. అప్పటి నుంచి వెంకటమ్మ మద్యం తాగొద్దని భర్తను వారించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఈనెల 2వ తేదీన మద్యం విషయమై దంపతుల నడుమ వాగ్వాదం జరిగింది. జానీబాషా మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో నుంచి వెళ్లిపోయి మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగాడు. తిరిగి ఇంటికొచ్చి పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు గౌస్‌బాషా బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్సై శ్రీహరిరెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ప్రభుత్వ వైద్యులు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు.

తెలుగు సినిమా పుట్టినరోజు వేడుక నేడు

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏపీఎఫ్‌సీసీ) నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకను మంగళవారం నిర్వహిస్తున్నట్లు కో– ఆర్డినేటర్ కళాంజలి అనంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్యా నగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్క్‌లో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

శ్రీధర రామాయణం గ్రంథావిష్కరణ

నెల్లూరు(బృందావనం): మాచవోలు శ్రీధర్‌రావు రచించిన 'శ్రీధర రామాయణం' గ్రంథాన్ని సోమవారం మాగుంట లేఅవుట్‌లో ఉన్న సన్నిధి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత శ్రీధర్‌రావు మాట్లాడుతూ అయోధ్యలో ఇటీవల రామమందిరం ప్రారంభం సందర్భంగా శ్రీధర రామాయణాన్ని రాశానన్నారు. కార్యక్రమంలో సన్నిధి ఆధ్యాత్మిక సంస్థ నిర్వాహకుడు అల్లు భాస్కర్‌రెడ్డి, పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకటప్పయ్య, కోడూరు ప్రభాకర రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- వీఎస్‌యూ వైస్ చాన్సలర్ సుందరవల్లి
- మహిళా చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి

వెంకటాచలం : బాల్య వివాహాలను జరిపించడం చట్టరీత్యా నేరమని, ఈ విషయాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో తెలియజేయాల్సిన అవసరం ఉందని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద నున్న వీఎస్‌యూలో మహిళా చట్టాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ సుందరవల్లి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరిగే అఘాయిత్యాలు, అన్యాయాలను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక కఠినమైన చట్టాలను అమలు చేస్తోందని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు కుటుంబ పరిస్థితులు బాగోలేవని, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో చిన్నతనంలో వివాహాలు జరిపిస్తున్నారని చెప్పారు. బాల్య వివాహాలను జరిపించడం వల్ల బాలల భవిష్యత్‌కు చాలా ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. బాలికలు చిన్నతనంలో వివాహాలు చేసుకోవడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడాల్సి వస్తుందని తెలియజేశారు. బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు విద్య ద్వారానే అనేక విషయాలపై అవగాహన పెంచుకోగలుగుతారని సూచించారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బి.సురేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటుగా, రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలియజేశారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్కంపేట పాఠశాలకు నూతన సొబగులు



పూర్తి కావచ్చిన ఎన్ఎస్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల

- పూర్తి కావచ్చిన అభివృద్ధి పనులు
- ఈనెల 11న మంత్రి కాకాణిచే ప్రారంభం

మనుబోలు : మండలంలోని అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూతన సొబగులు వచ్చాయి. పాఠశాల నూతన భవనం దాదాపు పూర్తి కావచ్చింది. ఈనెల 11న పాఠశాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అక్కంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో మూతపడే దశకు చేరుకోగా అప్పటి సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోర్టును ఆశ్రయించి పాఠశాలను కాపాడుకున్నారు. అంతటితో ఆగకుండా తన సొంత నిధులతో పాఠశాల అభివృద్ధికి పాటుపడ్డారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాలలో డిజిటల్ క్లాసులు, ప్రత్యేక ట్యూటర్‌లను ఏర్పాటు చేయడంతో క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఆపై స్థానిక ఎమ్మెల్యే కాకాణి సహకారంతో ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్పు చేయించుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు–నేడు ఫేజ్–2లో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనం కోసం రూ.1.53 కోట్ల నిధులు కేటాయించింది. పాఠశాల అభివృద్ధికి కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న భవనానికి కిరణ్ తండ్రి నారపరెడ్డి సీతా రామిరెడ్డి(ఎన్ఎస్ఆర్) పేరు పెట్టేందుకు అనుమతి నిచ్చింది. పాఠశాల ఆవరణలో జిమ్, ఆట స్థలం అభివృద్ధి, సరస్వతీ విగ్రహం ఏర్పాటు తదితర ఖర్చులన్నీ కిరణ్ సొంత నిధులతో చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణం చివరి దశలో ఉంది.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



కొడవలూరు తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు సిబ్బంది అభినందన



కోవూరు: తహసీల్దార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

కొడవలూరు: మండల తహసీల్దార్‌గా పి.శైలేంద్ర కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా కంభం మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఈ.రమాదేవి గుంటూరు జిల్లా చేబ్రోలు మండల తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శైలేంద్రకుమార్‌ను డీటీ గున్నం మల్లికార్జున, ఆర్ఐ సునీల్‌కుమార్, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలస్థాయి అధికారుల బదిలీలు జరుగుతుండడం తెలిసిందే.

కోవూరు తహసీల్దార్‌గా విజయశ్రీ

కోవూరు: మండల తహసీల్దార్‌గా జె.విజయశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.పద్మజ గుంటూరుకు బదిలీ అయిన విషయం విధితమే. ఈ మేరకు కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో విజయశ్రీని సిబ్బంది ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో టీడీ ఇలియాజ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, ఏఎస్ఓ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ సుధా, వీఆర్వో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ పంపిణీకి సింగిల్ విండో క్యాంప్

పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 9వ తేదీన గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఆధార్‌తో పాటు జీరో బ్యాంకు అకౌంట్‌ను ప్రారంభించేందుకు సింగిల్ విండో క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ క్యాంప్‌ను ఐటీడీఏ నెల్లూరు వారు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు సోమవారం రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, దారి వివాదాలు, భూముల సర్వే తదితర సమస్యలపై రైతులు అర్జీలను అందజేశారు. వీఆర్వోల ద్వారా విచారణ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ వెల్లడించారు.

టీడీపీ నేతలూ విచారణను ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మనుబోలు : తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై టీడీపీ నేతలు అనేక ఆరోపణలు చేశారని, అయితే వాటిని ధైర్యంగా ఎదుర్కొని తప్పు చేయలేదని నిరూపించుకున్నారని, అదే విధంగా టీడీపీ నేతలకు ధైర్యం ఉంటే వారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణను ఎదుర్కోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. మనుబోలు సచివాలయం–2 ఆవరణలో వారు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నెల్లూరు కోర్టులో ఫైళ్ల దొంగతనం ఘటనలో తప్పు చేయలేదు కాబట్టే తమ నాయకుడు కాకాణి ధైర్యంగా సీబీఐ విచారణను ఎదుర్కొన్నారని తెలిపారు. కానీ చంద్రబాబు మాత్రం తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా కోర్టులను అడ్డం పెట్టుకుని విచారణ నుంచి తప్పించుకుంటున్నాడన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, బొమ్మిరెడ్డి మధురెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, గుంజి రమేష్, ఏలూరు భాస్కర్‌రెడ్డి, మహేంద్రవర్మ, సుధాకర్‌రెడ్డి, జయశేఖర్‌రెడ్డి, దయాకర్, గిరి పాల్గొన్నారు.

మహిళను మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళను మోసగించి వివాహం చేసుకున్న వ్యక్తిపై బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రామలింగాపురం ముత్యాలపాళేనికి చెందిన ఓ మహిళకు వివాహమై భర్త చనిపోయాడు. ఆమెకు ఇద్దరు పిల్లున్నారు. ప్రస్తుతం ఆమె నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్లో శానిటరీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. అక్కడే పనిచేస్తున్న షేక్ షబ్బీర్ అహ్మద్ ఆమెతో సన్నిహితంగా మెలుగుతూ పిల్లల్ని బాగా చూసుకుంటానని ఆమెకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత ఆమెను ఇబ్బందులు పెట్టసాగడంతో విచారించింది. దీంతో అతడికి ఇది వరకే వివహమైందని తేలింది. దీంతో సదరు మహిళ షబ్బీర్‌ను నిలదీయగా చంపుతానని బెదిరించడంతోపాటు ప్రైవేట్ ఫొటోలను అందరికీ పంపుతానని బెదిరించసాగాడు. ఈ మేరకు బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఎస్సై పి.విజయ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

మర్యాదపూర్వకంగా..



చైర్‌పర్సన్ దంపతులకు మొక్క అందజేస్తున్న కమిషనర్ రమణబాబు



తహసీల్దార్ సురేష్‌బాబును సన్మానిస్తున్న సతీష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా నియమితులైన రమణబాబు సోమవారం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, నగర పంచాయతీ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ మోర్ల మురళి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన సతీష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం మండల తహసీల్దార్‌గా నియమితులైన సురేష్‌బాబును వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించారు. సురేష్‌బాబు బాపట్ల జిల్లా మార్టూరు నుంచి బదిలీపై బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మచ్చలేని నాయకుడు కాకాణి



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం: జిల్లా రాజకీయాల్లో మచ్చలేని నాయకుడు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నెల్లూరు కోర్టులో ఫైళ్ల చోరీ కేసులో మంత్రి కాకాణి పాత్ర ఉందంటూ చంద్రబాబు, సోమిరెడ్డి పనికట్టుకుని ఆరోపణలు చేస్తూ వచ్చారని, అయితే మంత్రి కాకాణికి సీబీఐ క్లీన్‌చిట్ ఇవ్వడంతో చంద్రబాబు, సోమిరెడ్డి నోళ్లు మూతపడి పోయాయని పేర్కొన్నారు. జిల్లా రాజకీయాల్లో ఆదర్శ నేతగా గుర్తింపు పొందిన కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఎలాగైనా ఓడించాలని సోమిరెడ్డి అనేక కుట్రలు పన్నుతున్నాడని మండిపడ్డారు. సోమిరెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో పోటీ పడాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా నేత కొణిదెన విజయభాస్కర్ నాయుడు, సర్పంచ్‌లు నాటకం శ్రీనివాసులు, అడపాల ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు శివారెడ్డి, ఎస్సీసెల్ మండల కన్వీనర్ మందా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను మోతాదులో వాడాలి



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీమాధవి

- ఏడీఏ లక్ష్మీమాధవి

పొదలకూరు : రైతులు తగిన మోతాదులో ఎరువులను వాడాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జి.లక్ష్మీమాధవి సూచించారు. మండలంలోని తాటిపర్తి, మహ్మదాపురం గ్రామాల్లో సోమవారం వరిపైరును పరిశీలించి ఆర్బీకేలో రైతులకు సాగులో మెళకువలు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు నివారణ చర్యలను వివరించారు. మండలంలోని 7,877 ఎకరాల్లో వరిసాగు అవుతోందని, పిలక, చిరుపొట్ట దశలో పైర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. శాస్త్రవేత్త విజయ్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ నానో డీఏపీ, నానో యూరియా, సముద్రపు నాచు ఎదుగుదల ప్రేరేపితాలపై రైతులతో మాట్లాడారు. అవగాహన సదస్సులో పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్, ఏఓలు మధురిమ, యు.గీతాకుమారి, ఇఫ్కో జిల్లా అధికారి వీఆర్ లక్ష్మీనారాయణ రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పామూరు లచ్చారెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా వైద్యారోగ్య సిబ్బంది, వలంటీర్లు పనిచేయాలని ఎంపీడీఓ పి.రామాంజనేయులు అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నిర్వహించనున్న రెండో విడత సురక్ష శిబిరాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేకంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను కూడా అందజేస్తారని వివరించారు. అనంతరం డీఎల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటమి తప్పదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముత్తుకూరు : అసత్య ఆరోపణలతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రతిష్ట దిగజార్చాలని ప్రయత్నించిన టీడీపీకి రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధనరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్, ఎంపీపీ గండవరం సుగుణ, పార్టీ నేత కె.లక్ష్మణరెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కోర్టులో జరిగిన చోరీతో మంత్రి కాకాణికి ఎలాంటి సంబంధం లేదని, అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ నిర్ధారించిందని గుర్తుచేశారు. అయితే, ఈ చోరీకి సంబంధించి కాకాణిపై గతంలో ఆరోపణలు చేసిన టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేశ్, సోమిరెడ్డి సిగ్గుతో తలవంచుకోవాలన్నారు. ముఖ్యంగా అవినీతిలో కూరుకుపోయిన సోమిరెడ్డి ఐదోసారి ఓటమి ఖాయమన్నారు. ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్‌బాషా, యల్లంగారి వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, గండవరం సూరి పాల్గొన్నారు.

సోమిరెడ్డివి నిరాధార ఆరోపణలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై సోమిరెడ్డి చేసినవి నిరాధారమైన ఆరోపణలు అని, అందుకే సీబీఐ నుంచి క్లీన్‌చిట్ లభించిందని వైఎస్సార్‌సీపీ మండల నేతలు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా పోలీస్ విచారణను తప్పుపట్టిన సోమిరెడ్డి సీబీఐ ఇచ్చిన క్లీన్‌చిట్‌కు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమిరెడ్డి ఆరోపణలను సీబీఐ తోసిపుచ్చిందని, ఇకనైనా సిగ్గు తెచ్చుకోవాల్సిందిగా హితవు పలికారు. ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, నాయకులు మద్దిరెడ్డి రమణారెడ్డి, ఎస్‌కే అంజాద్, సోమా భాస్కర్, ఎం.శేఖర్‌బాబు, వూకోటి లక్ష్మీనారాయణ, భారతమ్మ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

నెల్లూరు(టౌన్): 'రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి. ఎక్కడైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందేందుకు చర్యలు చేపట్టాలి' అని మోటార్ వాహనాల తనిఖీ స్క్వాడ్ అధికారి రాంబాబు సూచించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వాహనదారులకు గోల్డెన్ అవర్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ సమారిటన్‌గా గుర్తించబడిన వారికి కలెక్టర్ రూ.5 వేలు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారని తెలియజేశారు. ఇటీవల గణతంత్ర దినోత్సవం వేడుకల్లో ఇద్దరికి ఇచ్చినట్లు వెల్లడించారు. వైద్యురాలు డాక్టర్ స్వరూపరాణి మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాలన్నారు. గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకుంటే ప్రాణాలు నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపరవాణా కమిషనర్ చందర్, సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారులు వీర పూర్ణచంద్రరావు, స్వప్నీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతుల అందజేత



నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ డిపోలో పలువురు ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. ప్రయాణికుల ఆదరణ పొందేందుకు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ప్రధాన కార్యాలయం ఉత్తర్వుల మేరకు ఆర్టీసీ నెల్లూరు–2 డిపో అధికారులు గిఫ్ట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టారు. ముత్తుకూరు రూట్‌లో రాకపోకలు సాగించిన వారికి కూపన్లు అందజేశారు. డిపోలో బాక్స్‌లను ఏర్పాటు చేసి వాటిని స్వీకరించారు. సోమవారం లక్కీ డిప్ తీసి మొదటి బహుమతిని కె.రాములు, రెండో బహుమతిని సుభాషిణికి అందజేశారు. నెల్లూరు–2 డిపో మేనేజర్ శివకేశవయాదవ్, సూపర్‌వైజర్లు, గిఫ్ట్ దాతలు కేఎస్ఆర్ రియాల్టీ ప్రతినిధులు హాజరయ్యారు.